# అతని కంటే ఘనుడు



కె. చిన్నబాబు

సూరిబాబు సూసైడ్ చేసుకోబోయి ఫెయిలై హాస్పిటల్‌లో అడ్మిటయ్యాడన్న వార్త విని, హతాశుడయ్యాడు హన్మంతరావ్.

సూరిబాబతనికి బాల్యస్నేహితుడు. ఇప్పుడంటే వారివారి ఉద్యోగాలరీత్యా వేరైపోయారుగానీ విశాఖలో ఉన్నంతకాలం వాళ్లిద్దరూ ఎప్పుడు చూసినా మొగుడూపెళ్లాల్లా కలిసి మెలిసి తిరుగుతూండేవారు. ఎక్కడ ఎల్‌కేజీ - ఎక్కడ ఎమ్మెస్సీ... కలిసే చదువుకున్నారు విశాఖలో వాళ్లిద్దరూ.

పిజి పూర్తయ్యాక సూరిబాబుకి విశాఖలోనే

ఉద్యోగంరాగా - హన్మంతరావుకి విజయవాడలో వచ్చింది. అందువల్ల వాళ్లిద్దరూ అనివార్యంగా వేరైపోయారు. కాలక్రమాన వాళ్లిద్దరికీ పెళ్లిళ్లయ్ వారివారి సంసారాల గొడవలో పడిపోయారు.

గత నాలుగేళ్లుగా ఉత్తరప్రత్యుత్తరాలు, ఫోన్లు కూడా లేవు - వాళ్లిద్దరిమధ్యా. ఇద్దరిలో ఏ ఒక్కరికైనా ఉత్తరాలు రాసిచచ్చే అలవాటు ఉండి ఏడుస్తేగా! అలాగే రాకపోకలు కూడా లేవు. బాల్యస్నేహాలు కాలగర్భాన కరిగిపోవడం మామూలేగా!

ఏదో పనిమీద విశాఖ నుంచి విజయవాడ వచ్చిన విజయకుమార్ అనే మరో స్నేహితుడి ద్వారా తెలిసింది హన్మంతరావ్‌కా విషయం.

"నిన్ననే జరిగిందిది. నిద్రమాత్రలు మింగాడు. ప్రమాదమైతే తప్పిందిగానీ, ఇంకో నాలుగైదు రోజులు హాస్పటల్లోనే ఉండాలట..." అని అతను చెప్పగా -

హాస్పటల్ పేరు, బెడ్‌నంబరూ వగైరా వివరాలడిగి నోట్‌చేసుకున్నాడు హన్మంతరావ్.

అసలింతకీ ఆత్మహత్యకి కారణం ఏమిటని అడిగితే 'అప్పులపాలైపోయాడు' అని చెప్పాడే తప్ప, అంతకన్నా వివరాలేం చెప్పలేకపోయాడు విజయ్‌కుమార్.

సరేలెమ్మని రెండురోజులు ఆఫీసుకి సెలవు పెట్టి, సూరిబాబుని పరామర్శించి రావడానికని విశాఖ బయల్దేరాడు హన్మంతరావ్.

ట్రైన్‌లో ఉన్నంతసేపూ అతను సూరిబాబు గురించే ఆలోచిస్తూ గడిపాడు.

సూరిబాబూ, తనూ చిన్నప్పట్నుంచీ ఎంతో స్నేహంగా ఉంటూనే ప్రతి విషయంలోనూ పోటీపడుతూండేవారు. చదువులోను, ఆట పాటలలోనూ... ఆఖరికి అమ్మాయిల్ని ఏడిపించడంలోనూ - అన్నిట్లోనూ పోటీనే!

వాడి మాట ఎలా ఉన్నా, తనలో మాత్రం ఆ పోటీ మనస్తత్వం మరీ ఎక్కువగా ఉండేది. వాడేం చేసినా సరే దానికన్నా ఓ పిసరు ఎక్కువగా చేసి చూపిస్తేగాని తృప్తిగా ఉండేదికాదు తనకి. ఆ రకమైన మనస్తత్వాన్ని డెవలప్ చేసుకుంటూ వచ్చినందువల్ల అన్ని విషయాల్లోనూ వాడికన్నా తనదే పైచేయిగా ఉంటుండేది అప్పట్లో.

"సూరిబాబు తెలివైనవాడే! మరెందుకని అప్పులపాలై పోయాడబ్బా? దట్టూ ఆత్మహత్య చేసుకోవాల్సినంత ఇదిగా?"

విశాఖ చేరుకుని హాస్పటల్లో సూరిబాబుని పరామర్శించాక ఆ ప్రశ్నే అడిగాడు హన్మంతరావ్.

"ఎందుకైతేనేమి? మొత్తానికి అప్పులపాలై పోయాను... ప్చ్..." అంటూ నిట్టూర్చాడు సూరిబాబు.

"సర్లే... నీకున్న అప్పులన్నీ కలిపితే మొత్తం ఎంత ఉంటాయ్?" అడిగాడు హన్మంతరావ్.

"పాతిక లక్షల పైమాటే..." చెప్పాడు సూరిబాబు.

హన్మంతరావ్‌కి గుండె ఆగినంతపనైంది ఆ ఫిగర్ వినగానే... గబగబ అందుబాటులో ఉన్న గ్లాసులోని మంచినీళ్లు గడగడ తాగేసాడు.

"అంబాబోయ్! పాతిక లక్షలే! ఎలా పుట్టించగలిగావ్‌రా అన్ని అప్పులు? అంత డబ్బెలా ఇచ్చారు? అసలు ఆ డబ్బంతా ఏంచేసావ్?" అనడిగాడు ఆశ్చర్యంగా.

'అతి తెలివిగా పెద్దపెద్ద మొత్తాలు అప్పు




చేయడం ఎలా?' అనే దాన్ని గురించి ఓ పావు గంటసేపు ఉపన్యసించి - అనగా సదరు చిట్కాలన్నీ విడమరచి చెప్పి -

"అలా చేసాన్రా పాతికలక్షల అప్పు..." అన్నాడు.

"సరే... ఆ డబ్బు ఏది?"

"ఆ డబ్బంతా నా జల్సాలకి ఖర్చయిపోయింది. ఇప్పుడిక కొత్తగా అప్పులు పుట్టించలేక, పాత అప్పుల్ని తీర్చలేక - ఇలా ఆత్మహత్యకి పూనుకున్నాను..." అంటూ ముగించాడు సూరిబాబు - ఆఖరివాక్యం అంటున్నపుడు అతని తల సిగ్గుతో అటు తిరిగింది.

కాసేపు నిశ్శబ్దంగా ఉన్నారు ఇద్దరూ.

"డోంట్‌వర్రీ... నేను విజయవాడ వెళ్లాక - ఓ నెలరోజుల తర్వాత నీకు పాతిక లక్షలు పంపిస్తాను. ఈ నెలరోజులూ ఎలాగోలా మానేజ్ అవ్వు! నేను పంపించిన పైకం అందేక, అప్పులన్నీ తీర్చేసుకుని... ఇకనైనా భార్యాపిల్లల్ని అల్లాడించకుండా సుఖంగా ఉండు..." అని అతనికి ధైర్యం చెప్పి వచ్చేసాడు హన్మంతరావ్.

* * *

సూరిబాబు చెప్పిన చిట్కాలనే పాటించి - ఓ నెల తిరిగేసరికల్లా యాభైలక్షలు అప్పుచేసిన హన్మంతరావ్ - అందులోంచి పాతిక లక్షలు సూరిబాబుకి పంపేడు. మిగతా సొమ్ముతో సుఖంగా జీవించడం ప్రారంభించాడు.

ఆతనికన్నా ఇతను తెలివైన వాడు కాబట్టి ఇతనికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏర్పడలేదు.

పైగా - అప్పులిచ్చినవాళ్లే పిచ్చివాళ్లయ్ పోయారు. ●